# ఓ కుక్క వధ

"అక్కా .... అక్కా .... కుక్కలవాన్ వస్తోంది. మన కుక్క ఇంట్లో ఉందో లేదో చూడు దానిని బయటకు పోనీయకు. వాళ్ళు పట్టుకుపోతారు" అంటూ కంగారుగ్గా వచ్చి చెప్పాడు రఘు మాధవి పరుగు పరుగున వెళ్లి దొడ్లో, కుక్క పిల్లల్ని పెట్టిన చోటు చూసింది. దాలి గుంటలో కుక్కలేదు ఇంకా కళ్ళైనా తెరుచుకోని మూడు పిల్లలు మత్తుగా నిద్రపోతున్నాయి. రఘు కూడా అక్క వెనకాలే వచ్చాడు. కుక్క కనిపించకపోయేసరికి గుండె ఝల్లుమంది మాధవికి. "ఒరేయ్ కుక్కలేదురా. వీధిలోకి పోయి చూడు. కనిపిస్తే వెంటనే ఇంట్లోకి తెచ్చేయి. దిక్కుమాలినవాళ్ళు దానిని చూశారంటే పట్టుకుపోతారు" అని తమ్ముణ్ణి తొందరపెట్టింది. బాణంలాగా వీధిలోకి దూసుకుపోయాడు రఘు.

మరికొంచెం సేపట్లోనే తిరిగి వచ్చాడు.

"అక్కా ..... కుక్కని వాళ్ళు పట్టేసుకున్నారే. బోనులోంచి నన్ను చూస్తూ కుయ్యిమని ఏడ్చిందే. ఆ కుక్క మాదని విడిచిపెట్టమని ఎంత బ్రతిమాలినా విడిచిపెట్టలేదే వాళ్ళు. మొన్ననే పిల్లల్ని పెట్టిందని, తల్లి లేకపోతే పిల్లలు చచ్చిపోతాయని కూడా చెప్పాను. అయినా వాళ్ళు వినలేదు. రెండు రూపాయలిస్తే విడిచిపెట్తారట. ఇప్పుడే తెస్తానంటూ పరుగెత్తుకు వచ్చాను" అంటూ రొప్పుతూ చెప్పాడు రఘు.

"ఒరేయ్ .... నువ్వు పరుగెత్తుకెళ్ళి, మా అక్క పైసలు తెస్తోందని చెప్పి వాళ్ళు వెళ్ళిపోకుండా ఆపు. అమ్మనడిగి డబ్బులు తీసుకుని నీ వెనకాలే నేనూ వస్తాను" అంది మాధవి.

వీధిలోకి పరుగు తీశాడు రఘు.

స్నానం చేస్తున్న అమ్మని తొందరపెట్టి, రెండు రూపాయలు తీసుకుని తానూ వీధిలోకి పరుగెత్తింది మాధవి.

కాని వాళ్ళు వెళ్ళేసరికే కుక్కలున్న మునిసిపల్ వ్యాన్ ఎటుపోయిందో పోయింది. అది ఎటుపోయిందానని చాలాసేపు అక్కా తమ్ముడూ వెతికారు. కాని అది కనిపించలేదు.

మాధవికి, రఘుకి ఆ కుక్కసంగతి తలుచుకుంటుంటే ఏడుపు ఆగడం లేదు. రోడ్డుమీద ఏడవడం బాగుండదని, అతి కష్టం మీద ఆపుకున్నారు. ఇంటికి రాగానే వాళ్ళ ఏడుపుకట్టలు తెంచుకుంది. తల్లి ముందు జరిగింది చెప్పి భోరుమన్నారు. ఆమె మాత్రం ఏమి చేయగలదు? ఆమెకూడా ఎంతో బాధపడింది. "దుర్మార్గులు .... జాలీ దయా లేనివాళ్ళు. పిల్లల్ని పెట్టిందన్నా వినకుండా తీసుకుపోయారా! వాళ్ళూ అలాగే ఏడుస్తారు" అంటూ తిట్టసాగింది.

"తల్లి లేకపోతే ఆ పిల్లలేమవుతాయే ...." అంటూ ఏడ్చింది మాధవి.

"చచ్చిపోతాయి కదే అమ్మా" అంటూ అందుకున్నాడు రఘు.

"ఇప్పుడు వాటిని ఎలాగే పెంచడం?"

"కొంచెం కొంచెం పాల చుక్కల్ని వాటి నోట్లో పోద్దాం"

"అయితే వెంటనే పాలియ్యమ్మా"

పాలు తీసుకురావడానికి తల్లి లోపలికి వెళ్ళింది.

అసలు అది ఊరకుక్క. ఊరకుక్కే అయినా, దాని రక్తం ఎటువంటిదోకాని జాతికుక్క లాగా ఉండేది. ఆ నునుపు, ఆ ఠీవి అన్నీ కూడా ముచ్చట కొలిపేవిగా ఉండేవి. వాళ్ళింటికి వస్తుంటే కాస్త అన్నం మెతుకులు పడేసేవారు దానికి. ఆ విశ్వాసంతో అది వాళ్ళింట్లోనే ఉండేవి. ఎక్కడెక్కడ తిరిగి వచ్చినా చీకటి పడగానే మాత్రం ఇంటికి తిరిగి వచ్చేది. ములగ చెట్టు క్రింద చేసుకున్న గుంటలో పడుకుంటూ ఉండేది. పగటిపూట వీధిలో తిరుగుతున్నా చీటికి మాటికి ఇంటికి తిరిగి వస్తుండేది. కొత్త వాళ్ళెవరైనా వస్తే భౌయ్యిమని మొరిగేది. మేకలు కనక దొడ్లోకి వస్తే భౌభౌమని అరుస్తూ లాంగ్‌జంప్ చేస్తూ వాటిమీద పడి తరిమేది. పద్నాలుగేళ్ళ మాధవికీ, పదకొండేళ్ళ రఘుకీ ఆ కుక్కతో ఆడుకోడం ఒక సరదా. అదో కాలక్షేపం. అటువంటి కుక్క మునిసిపాలిటీ వాళ్ళ చేతుల్లో దుర్మరణం పాలుకావడంతో వాళ్ళకి ఆప్తమిత్రుడు పోయినట్లు కుటుంబ సభ్యుడు కరువైనట్లు అనిపించ సాగింది.

తన గుర్తుగా ఆ కుక్క మిగిల్చిపోయిన ఆ మూడు కూనల్నీ పెంచే బాధ్యత అక్కా తమ్ముళ్ళు స్వీకరించారు. గ్లాసులో పాలు తెచ్చి వాటిలో దూదిని ముంచి రఘు కుక్కపిల్లల నోరుతెరిచి పట్టుకుంటే, మాధవి బొట్లు బొట్లుగా వేసేది. అలవాటు లేకపోవడంతో కుక్కపిల్లలు ఆ పాలచుక్కల్ని మింగలేక పోయేవి. పాలు పక్కనుంచి కారిపోయేవి. తెచ్చినపాలు అయ్యేదాకా అలా కుస్తీ పట్టేవాళ్ళు అక్కా తమ్ముళ్ళు. ఆ గ్లాసుడు పాలలో మూడొంతులు పైన నేల పాలయ్యేవి. ఆ మిగిలిన కాసినీ అతికష్టం మీద వాటి కడుపులోకి పోయేవి.

రోజులు ఆవిధంగా గడుస్తున్నాయి. కుక్కపిల్లలు నెమ్మది నెమ్మదిగా పోతపాలకి అలవాటు పడుతున్నాయి. అయితే వేరే పాలు పడలేదో, మరెందుకో కాని ఆ మూడింటిలో రెండు పిల్లలు రెండు నెలలు తిరక్కుండా చచ్చిపోయాయి. అవి పోడం కూడా అక్కాతమ్ముళ్ళకి ఎంతో బాధనిపించింది. కనీసం ఆ మూడో పిల్లనైనా దక్కించుకోవాలని, మరింత శ్రద్ధగా జాగ్రత్తగా దానిని పెంచసాగారు. ఎలాగైతే వారి కృషి ఫలించి, ఆ కుక్కపిల్ల బతికి ముద్దుగా బొద్దుగా పెరగసాగింది. పైగా అది మగది కావడంతో దానికి మళ్ళీ పిల్లలు పుట్టడం, మళ్ళీ వాటికోసం తాపత్రయం ఉండదని వారికి సంతోషంగా ఉండేది.

ఆ కుక్కపిల్లకి 'మోతీ' అని ముద్దుపేరు పెట్టుకున్నారు వాళ్ళు. "మోతీ" అని పిలిస్తే చాలు ఎక్కడున్నా పరుగుపరుగున వచ్చేసేది. వారి ప్రక్కన నుంచుని తోకాడిస్తుండేది. వాళ్లు ఎక్కడికైనా వెళ్ళి వస్తే రెండు కాళ్ళూ భుజాల మీద పెట్టేసి ముఖం నాకాలని ప్రయత్నం చేసేది.

'మోతీ' మాధవి, రఘులకు చిట్టి తమ్ముడు. రోజూ దానికి ఒళ్ళంతా శుభ్రంగా సబ్బుతో రుద్ది స్నానం చేయించేవాళ్ళు. అప్పుడప్పుడు సాయంత్రం పూట దానిని వెంట పెట్టుకుని షికారు తీసుకెళ్తుండేవారు. ఇంట్లో ఉన్నప్పుడు దానితో ఆడుకుంటుండేవారు. బంతిని విసిరేస్తే అది పరుగెత్తి వెళ్ళి నోటితో కరచుకుని తెచ్చేది. దాని సహచర్యంతో బలే ఉషారుగా గడిచిపోతోంది వాళ్ళకాలం.

రెండేళ్ళు గడిచిపోయాయి. మాధవి వాళ్ళ నాన్నగారికి హైద్రాబాద్ బదిలీ అయింది. హైద్రాబాద్ వెళ్ళడమంటే ఆయనకి ఇష్టమే, కాని మోతీ పెద్ద సమస్య అయింది. దానిని కూడా తీసుకు వెళ్ళాలని మాధవీ, రఘు పట్టుపట్టారు. కాని ఆయనకీ ఆయన భార్యకీ కూడా కుక్కలూ,

పిల్లులూ అంటే ఇష్టం లేదు. ఏదో ఊళ్ళో అయితే ఇన్నాళ్ళు పిల్లలకోసం సరిపెట్టుకున్నారు కాని, పరాయి ఊరికి కూడా అందులోనూ హైద్రాబాద్ వంటి నగరానికి కూడా తీసుకువెళ్తామంటే ఎలా? అందులో అక్కడ కొంపల్లో తమకే చోటుండదు. ఇంకా కుక్క కూడానా. పైగా ఏ మేడమీదో ఇల్లు దొరికితే మరింత సమస్య కూడాను. ఇరుగు పొరుగు వాళ్ళతో లేనిపోనీ జట్టీలు కూడాను. ఇవన్నీ ఆలోచించి కుక్కని తీసుకెళ్ళకూడదనే నిర్ణయానికి వచ్చారు వాళ్ళు. పిల్లలేవో చెప్పబోతే కసురుకున్నారు కూడాను. ఇంక వేరే ఏమీ చెప్పలేక గ్రుడ్లనీరు కుక్కుకున్నారు పిల్లలు.

ఆయన రిలీవు కాగానే, హైద్రాబాద్ వెళ్ళి ఇల్లు చూసుకుని వచ్చారు. వచ్చాక సామానంతా ప్యాక్ చేసి లారీ ఎక్కించేశారు. మర్నాడే వారి ప్రయాణం. ప్రయాణం దగ్గర పడుతున్నకొద్దీ మాధవీ, రఘులకి దిగులు ఎక్కువైపోతోంది. వాళ్ళ ధోరణి పసికట్టిన వాళ్ళ నాన్నగారు కుక్క వీధిలోకి తిరగడానికి పోయిన సమయం చూసి, ఆటో ఎక్కి అందర్నీ రైలుస్టేషన్‌కి బయలుదేర దీశారు. ఆ ఊరికి రైలుస్టేషన్ ఆరుమైళ్ళు దూరంలో ఉంది.

జట్కా ఊరిపొలిమేర దాటింది. ఇంక ఫర్వాలేదు అనుకున్నారు వాళ్ళు. జట్కా రోడ్డు మలుపు తిరిగింది. ఎప్పుడు పసికట్టిందో ఏమో మోతీ పరుగు పరుగున వచ్చి జట్కా వెనకాలే పరుగెత్తుకు రాసాగింది. దానిని చూసి నిశ్చేష్టులయ్యారు దంపతులిద్దరూ. మాధవికీ, రఘుకీ దానిని చూస్తే ఎంతో ఆనందం వేసింది. కాని, నాన్నగారేమంటారోనని భయపబడి ఊరుకున్నారు.

జట్కా వెళ్తూనే ఉంది. మోతీ వెంటాడుతూనే ఉంది. అది రైలుస్టేషన్‌కి రాక తప్పదు. అక్కడికి వచ్చాక పిల్లలేం గోల చేస్తారో! అని ఆలోచించి జట్కాని వెనక్కి తిప్పమన్నాడాయన.

జట్కా వెళ్ళి తిన్నగా ఆయన స్నేహితుడు రంగనాధం గారింటి ముందు ఆగింది. అనుకోకుండా వచ్చిన ఈ అతిథులని చూసి ఆశ్చర్యపోయాడాయన. కుక్క సంగతి చెప్పి, దానిని వాళ్ళింట్లోనే కట్టేయమనీ, మర్నాడు తాము ఊరు వెళ్తామనీ చెప్పాడు. ఆయన బజారు వెళ్ళి కుక్కకోసం గట్టి ఇనప గొలుసుని తెచ్చాడు.

ఆ రోజు రంగనాధాన్ని కూడా కుక్కకి అలవాటు చేస్తూ దానిని స్వయంగా ఇనప గొలుసుతో కట్టేశాడు ఆయన.

మర్నాడు కుక్క చూడకుండా దొడ్డి త్రోవవెంట రైలు స్టేషన్‌కి బయలుదేరదీశారు ఆయన. గొలుసు కట్టిన కుక్క గమనించలేదని తెలుసుకుని తృప్తిగా నిట్టూర్చాడాయన.

జట్కా రైలు స్టేషన్ చేరింది. అందరూ పెట్టెలోకి ఎక్కారు. కుక్క రాలేదు. ఇంక ఫర్వాలేదనుకున్నారు దంపతులు. మాధవీ, రఘూ మాత్రం వస్తున్న ఏడుపుని అతికష్టం మీద ఆపుకుంటున్నారు.

రైలు కూత కూసింది. బయలుదేరడానికి సిద్ధంగా ఉంది. ఎప్పుడు వచ్చిందో ఏమో నాలిక ఆడించుకుంటూ, ఒక్క ఉదుటున రైలు పెట్టెలోకి దూకింది. తెగిన గొలుసుదాని మెడకి వ్రేలాడుతూనే ఉంది. కుక్కని చూడగానే రైలుపెట్టెలోని జనం "హేయ్ .... హేయ్ ... ఉష్ .... ఉష్.." అంటూ తరమడం మొదలు పెట్టారు. కుక్క వాళ్ళు అదిలిస్తుంటే ఒక అడుగు వెనక్కి వేస్తూ, మళ్ళీ ముందుకి వస్తోంది.

మాధవీ, రఘూ ఆనందానికి అవధుల్లేవు. వాళ్ళ అమ్మా నాన్న మాత్రం నిశ్చేష్టులయ్యారు. ఏమి చెయ్యాలో తోచలేదు వారికి.

రైలు మరోసారి కూసి కదిలింది.

జనం బలవంతాన కుక్కని బైటకి నెట్టారు. మాధవీ రఘు కిటికీలోంచి బయటికి చూడసాగారు.

కదులుతున్న రైల్లోకి మళ్ళీ ఎక్కే ప్రయత్నంలో మోతీ చక్రాల క్రింద పడిపోయింది.

రైలింజను మళ్ళీ భీకరంగా కూసి వేగం పుంజుకుంది. ఆ అరుపులో మోతీ ఆక్రందనం, మాధవీ, రఘు భయంకరంగా అరచిన కేక కలిసిపోయాయి.

*(ఉదయం వీక్లీ 21-7-1989)*